అందీ అందని చేలాంచలం

కరుణాకరం ఛటాలున ఆగాడు. ఎవరామె ? నిజంగా సుమిత్రేనా ? నిదానించి పెట్టెలోకి తొంగిచూశాడు. అదుగో మెడమీద పుట్టుమచ్చ. ఆమే నిశ్చయంగా ఆమే: తనిప్పుడేం చేయాలి ? గుర్తించనట్టు తొలిగిపోతే ! పదేళ్ళతరవాత కలుసుకుంటున్నాంగా—ఎందుకు పల్కరించకూడదు !

మెరుపులా మెరిసే స్వర్ణఘడియల్లో మనసేమి నిశ్చయానికి రాగలదు ? డోలాయమానంగా వుంటుంది. సుమిత్ర ఆనవాలు పట్టేసింది. 'కరుణ్' అంది పెద్దపెట్టున. కరుణాకరం దొరికిపోయాడు; దొంగ దొరికాడు.

ఫస్టుక్లాస్ పెట్టెలోనుంచి సుమిత్ర ప్లాట్‌ఫారంమీదికి గభాలున దూకింది. ఆమె చేసిన కరస్పర్శని షేక్‌హాండ్ అనడం న్యాయంకాదు. విడిపోయి, దూరమై, ఏవిధి బలం వల్లనో అప్రయత్నంగా కలుసుకున్న చేతుల కలయిక అది.

సుమిత్రచేతిని తన చేతిలోకి తీసుకున్న కరుణాకరం నిలువెల్లా కంపించాడు. ఆ జలదరింపుతో అతనికళ్లు చెమర్చడం సుమిత్ర గమనించిందా ? లేదు. అతనుమాత్రం మాటలు రాక నుంచున్నాడు. ఒక్కొక్కవేళ అలాటిది. ఎంత మాటకారికీకూడా మాటలు కరువవుతాయి.

"ఎక్కడికి వెళ్తున్నావ్ ? ఎక్కడ ఉంటున్నావ్ ? ఏం చేస్తున్నావ్ ?" సుమిత్రకి యింకా ఎన్నో అడగాలని ఉంది.

ప్లాట్‌ఫారంమీద వచ్చిపోయేవారూ, పక్కపెట్టెల్లోవారూ వీరినే పరకాయించి చూస్తున్నారు. వారు చూడటంలో తప్పులేదు. సుమిత్ర వేషం అలావుంది. ఆమె ఇద్దరుపిల్లలతల్లి అంటే ఒకపట్టాన నమ్మరు. మాతృత్వంవల్ల ఆమె అందం చెడలేదు సరిగదా ద్విగుణీకృతమైంది. దబ్బపండు లాటి చాయలోవుండే సునిషేమో, సన్నజరీవున్న ఎర్రటి క్రేపు సిల్కుచీరె, ఆమె విగ్రహానికి నిండిచ్చింది, జడ కత్తిరించే యించుకుంది కాబోలు—పార్సీ వాళ్ళలా బాబ్. ఆ బాబ్డ్ హెయిర్‌కికట్టిన నీలంరిబ్బనూ, కాళ్ళకివేసుకున్న నీలంపాస్టిక్ చెప్పులూ, నీలం సిల్కు బ్లవుజూ చూసి, సుమిత్రం అందాలు జేసుకోవడంలో నాటికీ నేటికి తీసిపోలేదనుకున్నాడు కరుణా కరం. పదివేలుచేసే వజ్రాలహారం వేసుకోగలిగిన తాహతు వుందిగాని, మెళ్లోవున్న సన్నటిగొలుసు సువర్ణం ఆమె వొంటిమీద ఎలా తళుక్కుమనేది చూపుతుంది. చేతికి గాజుల్లేవు—వాచీ, ఫస్టుక్లాసు పెట్టెలో ఒక్కతె, అంత వరకూ కిమ్మనకుండా కూచున్నమనిషి, ముప్ఫయ్యేళ్ళ మొగాణ్ణిచూసి, ప్లాట్‌ఫారంమీదికి దూకితే, లోకం తన రెండుకళ్ళకీ మరో రెండుకళ్ళు అప్పుతెచ్చుకు మరీచూస్తుంది.

సుమిత్ర చూపువాసి లావయింది. ఎత్తు మహాఅయితే ఒక అంగుళం పెరిగిందేమో! డ్రెస్ వేసుకోవడం వెనకే నయం. ఇప్పుడు చాలా Voluptuous గా ఉంది. పెదిమలకీ బుగ్గలకీ రంగేసుకోలేదు. వానిటీబాగ్ లేకేం—కంపార్టు మెంటులో పడేసింది.

"ఏం కరుణ్, ఎక్కడికి వెళ్తున్నావో చెప్పవ్ ?"

"ఎక్కడికీ లేదు. మద్రాస్ వొదిలి నేనెక్కడికి వెళ్తాను? ఇదే నా జననీ, జన్మభూమి.

"మద్రాసులోనే వున్నావా యిన్నేళ్ళబట్టీ ?" ఆశ్చర్యం వుట్టిపడుతూ అడిగింది సుమిత్ర.

"ఊఁ, ఆ యుద్ధపు హడావిడిలో మినహా."

"మద్రాస్ మీద బాంబులు పడతాయనే భయ పడ్డావా ?" —

"పడ్డాయిగా శాంపిల్‌కి."

ఇద్దరూ నవ్వుకొన్నారు.

"మెయిల్ కదిలేందుకు యింకా ఎంత టైముంది ?"

"పదినిముషాలు."

"అయ్యో పదినిముషాలే !"

"సరిగా తొమ్మిది నిముషాలే !"

"కంపార్టుమెంటులో కూచుందాం, రా."

"నన్నెక్కనీరు, లేడీస్ కంపార్టుమెంటు."

"నువ్వూ బొంబాయి వస్తున్నావా ?"

"ఉహు, ఎవరో ఫ్రెండుని ఎక్కించడానికి వచ్చాను. సెకండ్ బోగీలోనో థర్డుబోగీలోనో ఉన్నాడు."

"మళ్ళీ వెళ్ళాలా అక్కడికి."

"అక్కర్లేదు"

"మనం కలుసుకోవడం తమాషాగా లేదు ?"

"నేను అనుకుంటూనే వున్నా-ఎప్పుడో ఒకరోజున మన మిలా కలుసుకుంటామని" అన్నాడు కరుణాకరం

"కలుసుకొని..." రతీదేవిలా కనిపించింది సుమిత్ర.

"మన పదేళ్ళ జీవితాన్ని సమీక్షిస్తామని"

కరుణాకరానికి సుమిత్రని ఆగిపొమ్మని అడగాలనివుంది. కోరిక నాలిక చివర నృత్యం చేస్తోంది. ఇవ్వాళకి మా యింట్లో వుండి—అని అనగలడా? అంటే—వుండిపోతుందా? ఆమెకి తెలిసినవాళ్లూ, దూరపుబంధువులూ మద్రాసులో వుండకుండా వుంటారా? సుమిత్రకి కూడా లోకం అంటే జడుపా? అయినా అడుగుదామనుకున్నాడు కరుణాకరం. కాని, ఏవిధంగా అడగడం? ఏమిటీ మధువనస్వప్నం?

"బొంబయి ప్లేనుమీదపోక రైల్లో ఎందుకు?"

"మా పెదమామగారి కూతురూ అల్లుడూ హంపీ వెళ్ళారు. రేపు ఉదయం గుంటకల్‌లో నన్ను కలుసుకుంటారు."

"నువ్విలా వెళ్ళిపోవడం బావులేదు. ఈపూటకి మా యింట్లో వుండకూడదూ? రేపు పొద్దున్నే ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళవచ్చు"

సుమిత్ర తృటికాలం ఆలోచించిందో లేదో! "సామాను దింపించు" అంది. కరుణాకరం సుఖదుఃఖాలెన్నో అనుభవించాడు. కాని, ఈసాయంత్రం ఆమె వ్యవహారం సుఖదుఃఖ ద్వంద్వాతీతంగా ఉంది. బెట్టూ, సిగ్గూ, బెదురూ లేక,

"పద మిాయింటికి" అనే సుమిత్రసినిమాని కరుణాకరం కంగారుపడ్డాడు.

*   *   *   *

పదేళ్ళనాటిమాట. కరుణాకరానికి యిరవై వుండేవో లేవో! "లా" చదువుకుంటున్నరోజులు. కరుణాకరం తలిదండ్రులు బాగా డబ్బున్నవారూ కాదు; బీదవారూ కాదు. అంచేత కరుణాకరం అభిరుచులూ, అభిప్రాయాలూ మధ్యే మార్గాన. బసవరాజు పాటలూ, కృష్ణశాస్త్రి గేయాలూ, ఇబ్సన్ పలుకులూ అతనికి ఇష్టంగా వుండేవి. మిగతా మిత్రులకి మల్లే ఆదర్శాలు మాట్లాడేవాడు కాని, అవి మాట్లాడటానికి కాదు, జీవించడానికని తెలిసేది కాదు.

కరుణాకరానికి నటేశ మొదలియార్‌తో ప్రథమపరిచయం క్రవున్ టాకీసులో కలిగింది. జీవితాన్ని పెనవేసి పీల్చే సంబంధాల ప్రథమదశ యిలాగే హేతువుకి దొరకనంత తమాషాగా ఉంటుంది. వాం రారోజున చూసినది తమిళ స్టంట్ ఫిలిం. నటేశ మొదలియార్ వెంట అతని భార్యాబిడ్డలు ఉన్నారా అంటే అదీ లేదు. నటేశం వొక్కడే సినిమాకొచ్చాడు. రూపాయిన్నర సీట్లలో ఆరోజెంతోమంది లేరు. వీరిద్దరూ పక్కపక్కగా కూచున్నారు. ఫిలింను దూషించడంలోనూ, నటించిన తారామణి వేర్పుని శ్లాఘించడంలోనూ కరుణాకరం, నటేశ మొదలియారూ ఏకీభవించారు. రైలు పరిచయం రైలు దిగేదాకా—అలాగే

సినిమా పరిచయం. అప్పైన వెంటనే దీపాలు వేశారు. నటేశ మొదలియార్ కరుణాకరం మొహంచూసి, "మీరేం జేస్తున్నారు" అన్నాడు.

"చదువుకుంటున్నా, లా."

అంతటితో సంభాషణ ఆఖరు కావలసింది—కాని బయట దడదడ వర్షంపడుతూంది. కార్లున్న వారికి వర్షం పడితేనేం, పిడుగులు రాలితేనేం? మొదలియార్ కార్ని డ్రయివర్ గేటుదగ్గిరికి తీసుకువచ్చాడు. నటేశన్ వెనక్కి తిరిగి, "రండి మీరుకూడా. ఎక్కడైనా Drop చేస్తాను" అన్నాడు కరుణాకరంతో.

కరుణాకరానికి పెద్ద సంతోషమైంది. మద్రాసులో ఎంత మంచివాళ్లుంటారు! తనింతవరకూ తెలుగుపట్నాల్లో చదువుకొని ఈయేడే మద్రాసు వచ్చాడు. ఈ మొదలియార్ ది ఎంత మంచిస్వభావం—లేకపోతే తనకెందుకివ్వాలి ఈ Lift. మొదలియార్ తనని వాల్టాక్సురోడ్ లో, తన గదిముందు దించినపుడు, ఆయనకి కృతజ్ఞత ఎలా తెలపాలో తెలీక నానా యిబ్బందీపడ్డాడు కరుణాకరం. నటేశం కరుణాకరానికి తన విజిటింగ్ కార్డు యిచ్చి పై ఆదివారం సాయంత్రం నాలుగ్గంటలవేళ రమ్మని ఆహ్వానించాడు.

వర్షంలో, నేరుగా మెయిన్ రోడ్ మీదనుంచి పోక, చుట్టు తిరిగివచ్చి, తనను గదిముందు దించివెళ్ళిన సత్పురుషుడి పరిచయం పోగొట్టుకుంటాడా కరుణాకరం? ఆదివారం మూడు

గంటల ముప్పై అయిదు నిముషాలకి హాజరయ్యాడు నటేశం బంగళాముందు. బంగళా పెద్దది, విశాలమైన కాంపవుండూ, పూలచెట్లూ వున్నాయి. కరుణాకరం సూటూ, టై వేసుకోకపోతే వాచ్‌మేన్ అటకాయించేవాడే! డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూచునివున్నాడు నటేశం. కరుణాకరం పక్కనున్న మరోసోఫాలో చతికిలబడ్డాడో లేదో, సర్వెంట్ బాయ్ టీ బిస్కట్లూ తీసుకువచ్చి, అతనిముందు పెట్టాడు. పెద్దపెద్ద బంగాళాలూ, అకారణ ఆతిథ్యాలూ తెలీని కరుణాకరం నటేశం చేస్తున్న మర్యాదకి విస్తుబోవడంలో వింతేమిటి?

ఇక నటేశం సంగతి. నటేశమొదలియార్ మంచివాడూ కాదు, చెడ్డవాడూ కాదు. కరుణాకరానికి టీ బిస్కట్లు యిచ్చి నవ్వుతూ నాలుగు కబుర్లు చెప్పడం—"కాళ్ళు కడుక్కుని కాసిని మంచితీర్థం పుచ్చుకో—మనవాళ్ళంతా బావున్నారా" అని పల్లెటూళ్ళలో అడగటంలాటిది. తన యిరవైయేళ్ళ జీవితంలో కరుణాకరాన్ని అంత ఆదరించి మాట్లాడినవారెవరూ లేరు కనక యిదంతా కొత్తగావుంది. కాసేపు రాజకీయాలూ, రాబోయేయుద్ధం (యిది 1939 సంగతి) తయారీలోవున్న చిత్రాలూ మాట్లాడారు. ఇంతలో పదేళ్ళపిల్ల ఒకతె వచ్చి, "అక్కతో నన్నుకూడా సినిమాకి తీసుకు వెళ్ళవ్?" అంది.

"నువ్వూ, మీఅమ్మా చూశారుగా, అక్క చూడలేదట. అంచేత దానిని తీసుకు వెళుతున్నాను."

"నేను మళ్ళీ చూస్తాను—"

"ఆయన్నడక్క—ఒకే సినిమా రెండుసార్లు చూడవచ్చు నేమో ?"

నటేశం కలుపుగోలుతనానికి కరుణాకరం ఆనందభరితు డయ్యాడు. ఆపదేళ్ళపిల్ల కరుణాకరంవంక లేడిచూపులు చూసి కాసేపు యిటూ అటూ తిరిగి లోపలికి వెళ్ళి పోయింది.

"మీరు సినిమాకి వెళ్తున్నట్టున్నారు ఇంక నేనువెళ్తాను. Many thanks for your kindness."

"ఉండండి" అంటూండగా పదహారు పదిహేడేళ్ళ మ్మాయి వచ్చి, "పెదనాన్నా, ఊర్మిళ కిందపడి పోర్లి ఏడు స్తోంది. సినిమాకి తీసుకువెళ్తానని చెప్తూ దానితోటి" ఆపద హారు పదిహేడేళ్ళమ్మాయి కరుణాకరంవైపు చూసింది—కాని అతనితో నాకేంపని అన్నట్టు, పెదనాన్నని ఉద్దేశించి, ఊర్మిళ ఆకతాయితనం చెప్పింది.

"మొన్నరాత్రి వాల్టాక్సురోడ్‌లో దించానన్నాను—ఈయనే—"లా" చదువుతున్నారు."

ఆ అమ్మాయి నమస్కారంచేసింది. కరుణాకరం లేచి నుంచుని నమస్కృతు లందుకుంటూ ప్రతినమస్కారం చేశాడు.

"మా అమ్మాయే—సుమిత్ర. స్కూలుఫైనలు పాస యింది"

"చదవడం మానేశారా ?"

"వాళ్ళమ్మ జబ్బుమనిషి. తను బతికుండగానే దానికి మూడుముళ్ళూ పడాలంటుంది."

"నువ్వు చెప్తే విన దేమిటి అమ్మ! నీకూ నేనింక చదవడ మిష్టం లేకనే మానిపించావ్ !"

"మనకెందుకే అమ్మా చదువులు? ఉన్నది చూసుకుంటే చాలు"

కరుణాకరానికి సంభాషణలో జొరబడాలని వుంది. అవకాశంకోసం చూస్తున్నాడు.

"మీరు చూశారా 'వహీ;'" సుమిత్ర అడిగింది.

"లేదండి"

"చాలా బావుంటుందట. మా ఫ్రెండ్సంతా చెప్పారు"

"అయితే మీరుకూడా మాతో ఎందుకు రాకూడదూ?" అన్నాడు నటేశం. అది ప్రశ్నార్థకమా, ఆశ్చర్యార్థకమా? బతికిపోయాడు కరుణాకరం. నిక్షేపంగా వస్తాను. కాని, ఈ ప్రపంచమంతా కొత్తగా ఉంది అతనికి. సినీమాలో నటేశ మొదలియార్ సుమిత్రకీ కరుణాకరానికీ మధ్య కూచున్నా చిత్రాన్ని పొగడటంలో యిద్దరితో ఏకీభవిస్తూ, ఊర్మిళకి రెండు కప్పులు ఐస్ క్రీమ్ పెట్టించాడు.

ఆపైన కథంతా సవ్యంగా దివ్యంగా మనోజ్ఞంగా రామణీయకంగా నడిచింది. నటేశం అన్నకూతురు సుమిత్ర. ఆ అన్నగారు పరమపదించి చాలాకాల మవుతుంది. నటేశానికి

పిత్రార్జితం బంగాళాలూ, కలపవ్యాపారం ఉన్నాయి. వొదిన గారు జబ్బుమనిషి అవటంచేత అన్నగారికూతురూ కొడుకూ (సుమిత్ర కంటె చిన్నవాడు) నటేశందగ్గిరే పెరుగుతూ వచ్చారు. సుమిత్రకి రెండు మూడు మంచిసంబంధాలున్నాయి. ఈ వేసంగిలో ఏదో ఒకటి నిశ్చయం చేదామనుకుంటున్నారు.

రెండు నెలలు గడిచేటప్పటికి నటేశం కరుణాకరాన్ని ఈ భవనప్రాంగణంలో ప్రవేశపెట్టటంలో నిమిత్తమాత్రుడా అని తోచింది, సుమిత్రా కరుణాకరాల ప్రణయాన్ని గురించి కూడా తెలుసుకోగలిగింది. ఇద్దరూ దాపరికంలేకుండా ప్రవర్తించేవారు. దాచవలసిందేముంది? వయసులోవున్న అమ్మాయి వయసులోవున్న అబ్బాయిని ప్రేమిస్తోంది. అమ్మాయి తమది—నిప్పులాంటిపిల్ల; తెలివితక్కువ రకం కాదు. అబ్బాయి చామనచాయగా వున్నా రూపసి. ముక్కూ మొహం బావుంటాయి. వయసుకి తగిన రూపం విద్యా ఉన్నాయి. డబ్బా? తమకున్నది చాలు. ఒక్క యేడాది జరిగితే ప్లీడరు పట్టా పుచ్చుకుంటాడు. సూటూ టై లేకపోతే తననసలు లోనికి రానిస్తాడా అనుకున్న వాచ్‌మేన్, అబ్బాయిగారు సాయంత్రం వచ్చేవేళకి పూలగుత్తి కోసి, గేటుదగ్గిర అందిస్తున్నాడు. అది అబ్బాయిగారు అమ్మాయిగారికి బహూకరిస్తారు.

కరుణాకరం అదృష్టం ఒకరికి చెప్పడానికి వీల్లేనిది; చెప్పినా అర్థంకానిది. క్రిస్టమస్ సెలవులకి యింటికి అనగా

స్వగ్రామం – వెళ్ళడం మానేశాడు. పరీక్షకి కష్టపడిచదవా లని అబద్ధం రాశాడు. ఏమైతేనేం, సుమిత్ర రాజబాట కరుణాకరం తన ప్రియుడని స్పష్టంగా అంటుంటే. ఆత్మీయు లకి ఆమెమనసు తెలుసు. కాని కరుణాకరం తండ్రిచాటు వాడు, అతను బ్రాహ్మలబ్బాయి కావచ్చుగాని సంస్కార దృష్ట్యా సుమిత్రదే ఉత్తమసంస్కారం.

కరుణాకరం యింట్లో అందరికీ చనువయ్యాడు. వరసవర సనా అందర్నీ పిలిచేవాడు. ఇరుగూపొరుగూ పప్పన్నం ఎప్పుడనేవారు, నటేశానికి కాబోయే అల్లుడని అందరూ అనుకోసాగారు. ఇలా వుండగా......

సాయింత్రం అయిదున్నర అవుతుంది. సుమిత్ర కింద కనిపించలేదు. మేడమీద వుంటుందని తిన్నగా ఆమె గది దగ్గిరికిపోయాడు. వోరగావున్న తలుపు లోనికితోశాడు. డ్రసింగ్ టేబుల్ ముందు కూచుని టాయిలెట్ చేసుకుం టోంది. తెల్లటిచీరె ధరించింది. యింకా జడ అల్లుకోలేదు. బాడీ ఒక్కటే వేసుకొని వుండటంవల్ల కరుణాకరం ప్రవేశం అద్దంలోనుంచి చూసి పైట భుజంమీదకి లాక్కుని, 'హల్లో' అని ముద్దుచేస్తూ అతన్ని ఆహ్వానించింది. కరుణాకరం దగ్గిరికి వెళ్ళి, యిద్దరిమొహాలూ అద్దంలో పరికించాడు. 'రేపు పెళ్ళిలో అలాగే ఫోటో తీయించుకుందాం'' అంటూ అతని బుగ్గ గిల్లింది. అందుకు పరిహారంగా ఆమె రెండు చెక్కిళ్ళనీ నుదిటినీ, పాపిటనీ. మెడనీ ముద్దెట్టుకున్నాడు. జడ అల్లుకో

వడం అయినతర్వాత "ఒక్కసారి బయటికి వెళ్లు" అంది సుమిత్ర.

"ఏం ?"

"నేను జాకెట్టు వేసుకోవాలి."

"వెళ్ళను" అన్నాడు, ప్రేమ నేర్పే ముద్దులు గుడుస్తూ.

"బయటికి గెంటి తలుపేసుకుంటాను" అంది సుమిత్ర.

కరుణాకరం మొహంలో కాస్త కోపం కనిపించింది. సుమిత్ర తక్షణం కనిపెట్టి, 'మా బాబువి కదూ, నువ్వు మంచివాడివి' అంటూ గడ్డం పుచ్చుకు బతిమాలి, తన పెదవు లతని పెదవులకి అందించింది. వారి ప్రత్యేక ముద్దుల్లో ఒకటి. కరుణాకరం ఆమెని పొదివి పట్టుకున్నాడేగాని వొదిలిపెట్ట బుద్ధవలేదు. సుమిత్ర నెమ్మదిగా కౌగిలి సడిలించుకొని కరుణా కరాన్ని గుమ్మం వెలుపల నుంచోబెట్టి, తనులోపల గడి వేసుకొని జాకెట్టు మార్చుకొని, మళ్ళీ మామూలు చిలకలా కిలకిల్లాడటం మొదలెట్టింది.

కరుణాకరానికి సుమిత్రమీద తీవ్రవాంఛ చెలరేగింది. అతని మనసు ఏవో కుయుక్తులు పన్నుతోంది. కాళ్ళమీద పడైనా సుమిత్రని బతిమాలుకోవాలనిపిస్తోంది. మూడు నెలలనుంచీ లేని చిత్తసంక్షోభం ఈ సాయింత్ర మెందుకు పుట్టిందో !

ఇంట్లో అందరూ తలో పని మీదా వున్నారు. ఇంకా [illegible]య్య రాలేదు. ఏదో కారణం కల్పించి సుమిత్రని

మేడమీదికి తీసుకువచ్చాడు కరుణాకరం. సుమిత్ర తన గదిలో స్విచ్ నొక్కబోతూ వుండగా వారించి, అమాంతం తనకౌగిలిలోకి తీసుకున్నాడు. సుమిత్రకి ఇలాంటి చీకటిముద్దు అలవాటయాయి కనక ఎదురు చెప్పలేదు. ఆమెను బిగికౌగిలిలోబంధించి అన్నాడు: 'ఈ రాత్రి నిన్ను వొదలలేను సుమిత్రా.' అతని వేడిశ్వాస ఆమె చెంపల్ని తాకుతోంది. సుమిత్ర రాయీ రప్పా కాదు. రక్తమాంసాలున్న మనిషి. 'కరుణ్, దీపం వెయ్యనీ' అంది జాలిగా.

"వొద్దు—వొద్దు."

"నేనెక్కడికిపోతాను, కరుణ్! వెలుతురంటే అంత భయమెందుకు?"

"నాకు వెలుతురొద్దు—చీకటేకావాలి."

"వెర్రివాడివి, కరుణ్, వెలుతురులో నన్నుజూస్తే భయమేస్తుందా?"

"అవును."

అతను వొప్పుకున్న నిజానికి ఆమె పారవశ్యం చెందింది. అభ్యంతరం చెప్పదలుచుకోలేదు, ఎందుకంటే—అతన్ని నమ్మింది. తను లోబడి పోతున్నాననే భయం ఆమెని ఒక పక్క పీడిస్తూనేవుంది. మంచంమీద కూచుని కరుణ్ తల నిమురుతూ, లాలిస్తూ మనసు మార్చగల ననుకుంటూ, ఆఖరికి అతని వొళ్ళోకి వొరిగిపోయింది.

మెట్లు దిగుతున్నప్పుడు గాబోలు అతని భుజంమీద చెయ్యేసి, "కరుణ్, మనం తొందరలో పెళ్ళి చేసుకోక పోతే నాకు మనస్తాపం కలుగుతుంది."

"అలాగే—నాదేం ఆలశ్యం, తొందరగా ముహూర్తం పెట్టించు"అన్నాడు కరుణాకరం

ఆ తరువాత సుమిత్ర ఏనాడూ కరుణాకరాన్ని కాదన లేదు. ఏదో వీలుచూసుకొని అతనితో మేడమీదికి వచ్చేది. జబ్బుమనిషికి ప్రాణంమీదికి రావడంవల్ల ముహూర్త నిశ్చయం అనివార్యంగా ఆలస్యమయింది.

జబ్బుమనిషి ఒక దుష్టనక్షత్రాన యిహలోకయాత్ర పూర్తిచేసింది. ఆమె చనిపోయేవేళ కరుణ్ సుమిత్రా ఆమె మంచంపక్కనే వున్నారు. ఇద్దర్నీ పెళ్ళిజేసుకోమని ఆమె ఆశీర్వదించింది. తల్లిచావు సుమిత్రని కాస్త కలవరపెట్టింది గాని, కరుణ్ అండచూసుకొని శోకాన్ని దిగమింగింది. సుమిత్రా, సుమిత్రతమ్ముడూ అనాధలై పోయారు మాతృ మరణంతో.

జబ్బుమనిషికి వ్యాధి ఎక్కువైనప్పట్నుంచీ కరుణాకరం వాల్‌టాక్సురోడ్‌లో వున్న తనగదికి పోవడమే మానేశాడు. మకాం నటేశమొదలియార్ ఇంటిలోనే. నలుగురూ వింటే బావుండదని అతనికిమాత్రం కిందగది-గెస్టురూమ్‌యిచ్చారు. వారానికోసారిపోయి వాల్‌టాక్సురోడ్‌లోని గదిలోనుంచి తనకొచ్చిన ఉత్తరాలూ అవీ తెచ్చుకునేవాడు. ఇప్పుడు

తండ్రి మనియార్డర్ మీద ఆధారపడవలసిన అగత్యంకూడా అంతగా లేదు. తల్లి బతికుండగా ఒకరోజు సుమిత్ర తల్లినడిగి అయిదువందలు పుచ్చుకొని సిల్కు, ట్వీడ్, వులెన్ సూట్లు ఆరూ; ఒక డజను యింగ్లీషు పాప్లిన్ షర్టులూ కుట్టించి తీసుకు వచ్చింది. కరుణాకరం యింటర్ ప్యాసైనప్పుడు వాళ్ళమ్మ-రికమెండ్ చేయగా నాన్న ఒక ట్వీడ్ సూట్ కుట్టించాడు. కరుణాకరం వాలకమంతా మారిపోయింది. అతని సహాధ్యాయులు కాపీ తియ్యడం మొదలెట్టారు.

కరుణాకరం మధ్యరకం కుటుంబంలో పుట్టివుండటంవల్ల అతని నీతినియమాలుకూడా మధ్యరకంవే. నటేశ మొదలియార్ లాంటి ఘరానామనిషని చెప్పడానికి వీలులేదు. నటేశం అతన్ని అన్నివిధాలా నమ్మి యింటిలో స్థానమిచ్చాడు. సుమిత్ర అనురాగంమాట అటువుండగా ఈ నాలుగునెలలోనూ ఒక్కనాడూ కరుణాకరం సుమిత్రని తను పెళ్ళి చేసుకోవడంవల్ల, తను వొదులుకోవలసిన విలువలగురించి తీవ్రంగా ఆలోచించలేదు. పెళ్ళంటే—ఆ—అంటున్నాడు. తల్లికీ తండ్రికీ తను దూరమవుతాడు. చండశాసనుడు తండ్రి తిన మొహంకూడా చూడడు. ఆడది తల్లి బావురుమని ఏడుస్తుంది. కుటుంబానికివచ్చే అప్రతిష్ఠవల్ల తన చెల్లెలికి తొందరగా పెళ్ళికాదు. తను ఏకాకి అవుతాడు. సుమిత్ర కరుణా కటాక్షం, మంచితనం మినహా తనకేముంటాయి? మేనత్త కూతురు సరళకీ తనకీ రామ్ రామ్.

సుమిత్రతో వెళ్ళంటే తనకీ తన బంధువులకీ మధ్య కంచుగోడ. సరసాలాడే సరళ, చెల్లెలు కుసుమం, ఏభై యేళ్ళు పైబడ్డతల్లి, తను చేతికందుతా డనుకుంటున్న తండ్రి, తమ దొడ్లో వేసిన పూలమొక్కలు, మేడగదిలోని పుస్తకాల బీరువా—ఒక టేమిటి అన్నీ పోతాయి. కాని, వీటన్నిటి కంటె సుమిత్రప్రేమ గొప్పదికాదూ! పాతవాసనలు—కొత్తసౌరభం, రెండూ బలీయమైనవే!

పరాకుగా కూచున్న కరుణాకరం రెండుకళ్ళూ మూసింది సుమిత్ర.

"పేరు చెప్పాలా?"

"చెబుదువుగాని—మళ్ళీనెల మూడోతారీఖునట. మీ ఫాదర్, మదర్ వస్తారా?"

"నేను వెళ్ళి నచ్చజెబితే..."

"బాబోయ్—నిన్ను పంపను. నిన్ను వదిలి వుండలేను బాబూ" అంటూ సుమిత్ర అతనికంఠం కౌగలించుకుంది.

ఆమెకళ్ళలోకి చూస్తూ అన్నాడు కరుణాకరం "ఎప్పుడూ నన్నిలా ప్రేమిస్తావా, డియర్."

"ప్రేమించక—కరుణ్, ఎందుకొచ్చిం దాసంశయం నీకు."

"సంశయంకాదు, పుట్టినే అడుగుతున్నా, పెన్నిధిని పదే పదే చూసుకునే పేదవాణ్ణి నేను."

"పెన్నిధే పేదవాడివర మవుతూవుంటే..."

"నిజమే, నాలో ఏ ఘనతచూసి ప్రేమించావు నన్ను, సుమిత్రా ?"

"అదంతా నాకు తెలీదు. నువ్వు మంచివాడిలా కనిపించావ్."

"నిజంగా మంచివాడినా ?"

"ఒక్క విషయంలో మినహా" అంటూ కరుణాకరం బుగ్గలు సాగతీసింది.

కరుణాకరాన్ని ఎవరో భాగ్యవంతుల పిల్ల బుట్టలో వేసుకుందన్న శుభవార్త తండ్రిదగ్గిరికి మోసేందుకు వార్తాహారులకి కొదువా! కడుపుబ్బుపట్టలేక ఒక అఖండుడు ఆకాశరామన్న ఉత్తరం కూడా రాశాడు.

"ఆర్యా! తమ కుమారుడైన కరుణాకరం బొత్తిగా చెడిపోయినాడు. ఒక మొదలియార్లపిల్ల అతన్ని చేరతీసింది. మీవాడి చదువుసంధ్యలు గంట వాయించినయ్. ఆపిల్ల పినతండ్రి పరమదుర్మార్గుడు. మీ అబ్బాయిని వాళ్ళు ఖూనీ చేయించవచ్చు. తొందరలో మేల్కొనండి—మీ శ్రేయోభిలాషి."

ఈ ఉత్తరం చదువుకొని వెంకట్రామయ్య వీరహనుమానుల్లా యింట్లో ఎగిరాడు. ఎవరో కిట్టనివాళ్ళు కల్పించి రాశారేమో అన్న పెళ్ళాంమాటలు చెవిని పడితేనా! మర్నాడు మెయిలులో నురగలు కక్కుకుంటూ మద్రాస్ వచ్చాడు.

మెయిల్ దిగి వెంకట్రామయ్య ఏకాయెకి వాల్టాక్స్ రోడ్‌లోని కొడుకుగదికి వెళ్ళాడు. గది బీగం వేసివుంది. యిరుగు పొరుగును విచారించాడు. కరుణాకరం ఏగంగలో కలిస్తే ఎవడికి కావాలి? శ్రేయోభిలాషి అడ్రసు తెలియ నందుకు ఎంతో విచారించాడు వెంకట్రామయ్య. మరో చోట బస చేసి, రెండురోజు లనంతరం, వెంకట్రామయ్య కొడుకుని మౌంటురోడ్ ఫుట్‌పాత్ మీద కలుసుకోగలిగాడు. "నాయనా, నిన్నీకళ్ళతో చూస్తాననుకోలేదు" అన్నాడు బావురుమంటూ. కరుణాకరానికి ఉపద్రవమేమిటో తెలీలేదు గాని, తండ్రికి గూఢచారులద్వారా వార్త తెలిసివుంటుందని భావించాడు. ఇద్దరూ వాల్టాక్స్‌రోడ్‌లోని గదికి వెళ్ళారు.

"నాయనా ఏమిటీ అప్రతిష్ఠ!" అన్నాడు వెంకట్రామయ్య.

"ఏమొచ్చింది? ఆ అమ్మాయి సద్గుణవతి. ఈరోజుల్లో కులగోత్రా లెవరికి కావాలి?"

"నిజమే. నీకక్కర్లేదు, మామాటో?"

"పెళ్ళిచేసుకుంటున్నది నేను, మీరు కాదు."

"పిల్లలే కరువయ్యారా? నిరుడు వేసంగిలో సరళనే చేసుకోకపోయావా? బి.ఎల్ అయేదాకావద్దని యిలా నడిసముద్రంలో ముంచుతున్నావా మమ్మల్ని?"

"ముంచడంలేదు. సుమిత్ర యోగ్యురాలు, రండి వారింటికి వెళ్దాం."

"నేనా ? కంఠంలో ప్రాపిరివుండగా అలాటియింట్లో పాదంపెడతానా ? ఆ అమ్మాయికి డబ్బువుందిగదా అని నువ్వు కులుకుతున్నావ్ ! పెళ్ళయేదా కానేగాని ఆపైన నీమాట వింటుందా—డబ్బున్న ఆడది. మాకర్మఫలం" అంటూ తండ్రి వుప్పెనగా ఏడ్చాడు. చండశాసనుడైన తండ్రి ఏడవడమేమిటి ? ఆయన తనను నాలుగు తిడితే బావుండేది; క్రోధం పట్టలేక తనూ అనేవాడు. వెంకట్రామయ్య చలిమిడిముద్దలా అయిపోవడంతో కరుణాకరానికి ముందడుగు తోచలేదు. సుమిత్ర తనను చీదరించుకుంటుంది, చెట్—అసంభవం. ఈయన అమ్మను ప్రేమించి పెళ్ళిచేసుకొన్నాడా ? ప్రేమంటే తెలుసా ఆకాలపువాళ్ళకి. సుమిత్ర దృష్టిలో తను లోకువవడం సంభవనీయమా ? కాదు—అవును.

ఆసాయింత్రం సుమిత్రజడలో పూలు తురుముతూ అన్నాడు, "మా నాన్నగారొచ్చారు."

"ఏరీ ?"

"వాల్టాక్సురోడ్ లో వున్నారు"

"మనింటి కెందుకు తీసుకురాలేదు"

"అమ్మకి వొంట్లో బావూలేదట. వైద్యానికి వూరు తీసుకువద్దా మనుకుంటున్నారట."

"మరి మనసంగతి చెప్పావా ?

"ఆయనకి తెలుసు."

"ఏమన్నారు ?"

"ఏమీ అనలేదు."

"నిజంగా ?"

"నిజం !"

"మైలాపూర్‌లో యిల్లు మాట్లాడారు. నన్నుపోయి అమ్మనీ, చెల్లెల్నీ తీసుకు రమ్మంటున్నారు."

సుమిత్రస్థితి వర్ణనాతీతం. తల్లికి వొంటిలో బాగు లేదని తెలిసి ఎలా వెళ్ళొద్దంటుంది కరుణాకరాన్ని ? కాని, ఆమెకి కరుణాకరాన్ని వొదలడం హితవుగా లేదు. "నేనుకూడా వస్తాను" అంది.

"మాబంధువులు మంచివాళ్ళు కారు. నిన్నేదయినా అంటే నొచ్చుకుంటావ్. మూడో లేదీ పదిహేనురోజులు కూడా లేదు."

"ఎన్నాళ్ళకి వస్తావ్ ?"

"ఎల్లుండి వుదయం మెయిల్‌కి"

"అయితే ఈరాత్రే వెళ్తావా ?"

"ఊఁ"

సుమిత్ర గబగబా సూట్‌కేసులో బట్టలు సర్దింది. సెంట్రల్‌కి ఫస్టుక్లాసు బెర్తుకి ఫోనుచేసింది. బీరువాలోంచి మూడు వందరూపాయిల కాయితాలుతీసి కరుణాకరం పర్సులో పెట్టింది. ప్రయాణపు ఏర్పాటులన్నీ అరగంటలో ముగించి, కారు సిద్ధంగా వుంచమని చెప్పి మేడమీదికి వొచ్చింది.

కరుణాకరం బెర్తు కట్టుకుంటున్నాడు, సుమిత్ర రావడం చూసి వెనక్కితిరిగి రెండు చేతులూ చాచాడు. ఆమె కను కొలకుల్లో పేరుకుంటున్న బాష్పాలకి నిలవకట్టజే డేకవీశ్వరుడూను.

"రెండురోజుల వియోగం" అన్నాడు కరుణ్.

"రెండుయుగాలు."

"నాకుమాత్రం?"

"ఎల్లుండి మెయిల్ ఆలస్యం అవకుండా వుండాలి బాబూ!"

* * * *

ఆ ఎల్లుండికోసం సుమిత్ర మూడు నెలలు ఎదురు చూసింది! ఆమె కళ్ళు కాయలుకాచాయి. ఎవరూ తన మొహంమీద అననప్పటికీ నలుగురిలోనూ నగుబాట్లుకదా! నరేశం తను వెళ్ళి కనుక్కుని వస్తానన్నాడు. సుమిత్ర వద్దని నిష్కర్షగా అంది.

కరుణాకరం తల్లికి జబ్బూలేదు; గిబ్బూలేదు. కొడుకు ఏ మాయోపాయానికీ లొంగకపోవడంవల్ల వెంకట్రామయ్య "ట్రంప్ కార్డు" ఆజబ్బుని కల్పించాడు. కరుణాకరం రైలు దిగి యింటికి వెళ్ళగానే యింట్లోవాళ్ళందరూ బావురుమన్నారు. ఆ ఏడుపువిని ఎవరు చచ్చిపోయారా అని పస్తాయించాడతను. ఎవ్వరూ చావలేదు, అందరూ దుంగ ముక్కల్లా ఉన్నారు. ఇంటిలోవాళ్ళూ యిరుగుపొరుగు బంధువులూ కాకుండా, సరళా ఆమెతల్లీకూడా వచ్చివున్నారు.

కరుణాకరం తల్లి సీతాబాయమ్మ కొడుకుని ఘట్టిగా కౌగిలించుకొని : "నన్ను చంపుకుతిన్నట్టే! మళ్ళీ ఇంక పట్నం పోనని వొట్టేసుకో, నామాంట చూసినట్టే..." అంటూ శోకన్నాలు సాగించింది.

సరళ చక్రాళ్ళాటి కాటుకకళ్ళతో విచారం వెదజల్లుతూ "ఉండవే, అత్తా, బావని కాస్త విశ్రాంతి తీసుకోనీ. ఇంటిలో పాదం పెట్టాడో లేదో, అందరూ తలో మాటా అంటే ఎలా? కాఫీ అయినా తాగనివ్వం?" అంది తను ఒక్కతే బావ పక్షమైనట్టు.

కింద ఏడుపులూ మొత్తుగోళ్లూ అయిన తర్వాత కరుణాకరం, మేడమీదనున్న తనగదిలోకి వెళ్ళాడు. అతని వెనకాలే సరళా వెళ్ళింది-కాఫీ పాట్‌తో.

"బావా, నామీదకూడా నీకుకోపమా?" అంది సరళ, నెమ్మదిగా మాటల్లోకి దింపుతూ.

"ఛా, నీమీద నాకెందుకు కోపం! ఈరాత్రి వెళ్ళిపోవాలి, ఎలాగా అని ఆలోచిస్తున్నా, మనవాళ్ళు వొట్టిమూర్ఖులు ఇలాటి తలిదండ్రుల్ని పూజించడం ఎలా? ఈ దెబ్బతో నాకు 'మనవాళ్ళు' అంటే వున్న మమకారం అంతాపోయింది. నాకూ ఈయింటికీ నేటితో ఋణం తీరిపోతుంది."

"ఎందుకుబావా, అలా అంటావ్? నువ్వు సుమిత్రని పెళ్ళిచేసుకుంటేమాత్రం ఇక్కడికి రాకూడదూ? ఎవర్ని

చూడకపోయినా నన్నయినా చూడాలని అనిపించదా నీకు?"
సులువైన మాటల్లో రసమయకవిత్వాన్ని పొలికించగలరు స్త్రీలు - కొన్నికొన్ని సందర్భాలలో. ఆ విద్య వారికి జన్మతా వొస్తుంది. బావని కట్టెయ్యాలనే కోరిక సరళకి వుందిగాని తన సమర్థతపట్ల ఆమెకి విశ్వాసం లేదు.

"సరళా, నీమీద నాకెప్పుడూ అభిమానమే. ఈ నాలుగు గంటలూ నువ్వు వున్నావు కాబట్టి ఉండగలుగుతున్నాను. లేకపోతే వీధిలోనుంచి అలాగే వెళ్ళిపోయేవాణ్ణి."

మధ్యాహ్నం భోజనాలయాక, మేడమీద కూచుని, బావకి తాంబూలం యిస్తూ, సరళ అంది: 'బావా, నాకు మరొకళ్ళని పెళ్ళి చేసుకోవాలని లేదు. యం. బి. చదివి స్వతంత్రంగా జీవించాలని ఉంది. నీకూ సుమిత్రకీ పెళ్ళి అయినతర్వాత మీరిద్దరూ కలిసి నాకీసాయం చెయ్యాలి."

"ఎందుకు పెళ్ళి చేసుకోవు, సరళా ?"

"నువ్వు అడగకూడదు ఆమాట."

"నేను నిన్ను డిజపాయింట్ చేశానా ?"

"అడగవద్దన్నానుగా-అడగకు, వెంకట్రామయ్యమామకి నేను చదువుకోడం యిష్టం ఉండదు. ఈయింటిలో మనిద్దరం తప్పబుట్టాం. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోకపోవచ్చు కాని బావవి కాకపోతావా?" అని సరళ చిరునవ్వు నవ్వినప్పుడు పడ్డ ఆ చెక్కిళ్ళ సొట్టలు, కరుణాకరానికి అల్లరిజ్ఞాపకాలు గుర్తుకి తెచ్చాయి. ఆమె పాపిటమీద చెయ్యివుంచి 'సరళా' అన్నాడు.

"ఏం బావా!" అంది.

ఏమీ లేదు. మనసులోని శృంగార భావాలు చేసే శబ్దా లవి, వాటికి అర్థంపర్థం ఉండవు. కరుణాకరానికి సరళమీద అనురాగం లేకపోలేదు. కాని తను సుమిత్రకి హృదయాన్ని యిచ్చేశాడు, సరళ యం. బి. చదవడం విషయంలో సుమిత్ర ఎంతో సహాయం చేస్తుంది. సుమిత్ర అంటే ఏమిటో వీళ్ళం దరికీ ఇంకా తెలియదు.

ఆ రాత్రే తన ప్రయాణమని తెలీగానే, తల్లి సీతా బాయమ్మ నూతిలో దూకేందుకు అన్ని యేర్పాట్లు చేసు కుంది; ఆ ప్రయత్నం విఫలమవడంవల్ల నాటువిషం తెప్పించు కుంది. కరుణాకరానికి ఏమీతోచ లేదు. అవతల మెయిల్‌కు టైమౌతోంది! ఇంటిలో తల్లి ప్రాణాపాయస్థితి. బావని పనిగట్టుకు మేడమీదికి పిల్చింది సరళ.

"బావా! మెయిల్‌కి వెళ్తున్నావా, ఉంటావా? సీత మ్మత్తకి ఏమీ ఉపద్రవం రాదు. ఆమె అఘాయిత్యం మనిషి కనక అలా జేస్తుంది. నువ్వు వెళ్తానంటే నీకు ఓ మాట చెప్పాలి."

"ఏమిటది?"

"వెళ్తున్నావా?"

"వెళ్ళకపోతే సుమిత్ర చాలా బాధ పడుతుంది."

"పిచ్చి అవీ యిక్కడ వొదిలేసి, ధైర్యం చేసి వెళ్ళు. రైలుకి ఇంకెంతో టైము లేదు."

"నువ్వు చెప్పు, సరళా. అమ్మకేమీ ప్రమాదం లేదు గదా! నేను వెళ్ళిపోయానని తెలిసి—"

"పిచ్చిబావా, మన కుటుంబాల సంస్కారానికి మీ అమ్మ ఒక నమూనా."

సరళ నిశితదృష్టికి కరుణాకరం విభ్రాంతుడయ్యాడు, ఎంత లోతుగుండె ఆమెది! సరళ ఎంతటి సగసురాలు.

"ఏమిటో చెబుతానన్నావు?" అని అడిగాడు కరుణాకరం.

"నువ్వు వెళ్ళిపోయేముందు."

"నేను వెళ్ళకపోతే— ?" అను సరసోక్తికి సరళ బిత్తరపోయి, "సుమిత్ర నిన్ను నమ్మింది. సరళని నువ్వు భార్యగా గాక వేరురకంగా ప్రేమించగలవు" అంది.

పిడుగులుపడ్డా మెయిల్‌కి వెళ్దామనుకున్నాడు కరుణాకరం. కాని రెండు నిముషాల్లో మెయిల్ తప్పిపోయింది. సుమిత్రకి ఎక్స్‌ప్రెస్ వైర్ యిచ్చాడు. ఆ రాత్రి వెన్నెలలో సరళా తనూ మల్లెపందిరదగ్గర మడతమంచాలు వేసుకు పడుకున్నారు. ఎన్నోసంగతులు, అర్థం వున్నవీ లేనివీ, మాట్లాడింది రాత్రి సరళ. తెల్లారేటప్పటికి సీతాబాయమ్మ శుభ్రంగానే ఉందిగాని సరళతల్లి సుభద్రమ్మకి ఎక్కడనుంచి వచ్చి పట్టుకుందో కలరా పట్టుకుంది ఆసాయింత్రం నాలుగు గంటలకు సరళ తల్లిలేని కన్నెపడుచు అయింది; తండ్రి ఏనాడో గతించాడు; నేడు తల్లికూడా కరువైంది; అయినప్పటికీ మనోనిబ్బరం విడవలేదు ఆ అమ్మాయి.

"నా బాధలు నేను పడతాను, బావా, నువ్వు వెళ్ళిపో" అంది సరళ. కరుణాకరానికి కాళ్ళాడ లేదు. సుభద్రమ్మ చనిపోతూ అతనితో అంది: "నాయనా! నువ్వు ఎవర్ని పెళ్ళిచేసుకున్నా, తల్లీ తండ్రీ లేని సరళని కాస్త కనిపెట్టి, దాని యోగక్షేమాలు కనుక్కుంటూ వుండు."

కరుణాకరం మర్నాడూ వెళ్ళలేక పోయాడు. సుబ్రావ్ మరొక టెలిగ్రాం యిచ్చాడు అత్తమరణం తెల్పుతూ. అయిదో రోజు సాయంత్రం కాబోలు, చీకటిపడుతూ వుంది. స్నానంచేసి బట్టలు మార్చుకునేందుకు మేడమీదికి వెళ్ళాడు కరుణాకరం. ఆగది చీకటిలో ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. స్విచ్ నొక్కకుండా పిల్లిలా అడుగులు వేసుకుంటూ దగ్గిరికి వెళ్ళాడు. ఎవరు? సరళే.

"బావా, నువ్విక్కడనుంచి వెళ్ళిపో, బావా, సుమిత్ర దగ్గిరికి వెళ్ళిపో, బావా" అంటూ రెండుచేతులూ మెడకి పెనవైచి, గుండెలమీద తల ఆనించి, పెద్దపెట్టున ఏడ్చింది సరళ. కరుణాకరం ఆమె తల నిమురుతూ మొహం తన చేతుల్లోకి తీసుకున్నాడు. వెచ్చటికన్నీళ్ళు అతని అరిచేతుల్లో రాలాయి. ఆమె మొహం పైకియెత్తాడు. కనురెప్పలు రెండూ వంచేసింది సరళ. భయంకర వేగంతో ఆమెగుండె దడదడ కొట్టుకొంటోంది. ఆ చీకటిలో రెండు విభిన్న ప్రకృతి శక్తులు వీరవిహారం చేస్తున్నాయి. కరుణాకరం, సరళ—అనేవి నామధేయాలుమాత్రమే. పురుషుడూ, స్త్రీ—తెలిసీ

తెలియకా ఒకరికోసం ఒకరు అలా తపనపడటం సృష్టి శాసనం. అతని పెదవులు వెతుకుతున్నాయి.

"వొద్దు, బావా, వొద్దు. నువ్వు సుమిత్రమనిషివి, నే నిల్లా బతకడం నీకిష్టంలేదా ?" అంది సరళ కటువుగా.

"నన్ను సమస్తం మర్చిపోనీ, సరళా...ఏదీ——"

సరళ కా సాయంత్రం బావని కాదనగల శక్తి లేక పోయింది. సరళా కరుణాకరాల వివాహశుభలేఖ సుమిత్ర అందుకుని, గాయపడ్డ హృదయంతో మనశ్శాంతి పోగొట్టు కుని, బాబాయి చెప్పిన సింహాళవర్తకుణ్ణి, మారుమాటాడక పెళ్లిచేసుకుంది.

* * * *

నాటికి నేడు-పదేళ్ళతర్వాత. ఆనాడు కరుణాకరం పిరికి పందమాదిరి సుమిత్రనుంచి పారిపోయాడు. ఈనాడు వీలయితే ఆమె కంటపడకుండా తప్పించుకుందా మనుకున్నాడు. కాని సుమిత్రే, సుమిత్రే. అతన్ని నిలబెట్టింది. ఎప్పుడూ ఆమెదే పై చెయ్యి.

ఫ్రంట్ సీటులో తనపక్కన కూచుని ఏవేవో విశాల ప్రపంచపు వార్తలు చెబుతోంది సుమిత్ర. కారు పూనమల్లి హైరోడ్డుమీద నుంచి తిన్నగా తమ బంగాళావైపు తీసుకు వస్తున్నాడు. తన ప్రయోజకత్వంగురించి ఆమె ఏమయినా అడిగితే చెప్పడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇంకా పదిహేను

వేలు అప్పువున్నా ఈ బంగాళా తన కష్టార్జితమే. ఈ కారు తన కష్టార్జితమే. కాస్త మాగాణి పొలంకూడా కొన్నాడు. చెమటోడ్చి సంపాయించడంలో ఎంత సుఖముండేదీ సుమిత్ర ఏ నాడయినా తెలుసుకోగలదా? ఆవర్గం వేరు. తనవర్గం వేరు. ఈ వర్గమనే మాట తనీమధ్యనే నేర్చుకున్నాడు.

వాచరు గేటు తెరిచాడు. కారు పోర్టికోలో ఆగింది. "కారియర్ తీసుకుపోయి యిద్దరికి భోజనం పట్టుకురా" అన్నాడు కరుణాకరం వాచర్‌తో.

"చంపావ్, మీ శ్రీమతి యింట్లో లేదా, ఊళ్ళో లేదా, నిన్ను వొదిలేసిందా?" అని అడిగింది సుమిత్ర—మెట్లమీద పాదం పెడుతూ,

"మొన్న సాయంత్రమే కూడూరు వెళ్ళింది. నీకు మల్లేనే నాకూ యిద్దరూ పిల్లలు. పిల్లలుకూడా తల్లివెంట వెళ్లారు."

"గుడ్. ఏమిటి చెప్పు ఖబుర్లు?" అంది సుమిత్ర డ్రాయింగ్‌రూమ్ సోఫాలో చతికిలబడుతూ.

"స్నానం చేస్తావా?"

"నేను రైలుదిగి రాలేదుగా? ప్రయాణం మానేసి వచ్చాను...పొద్దున్నే ఎక్స్‌ప్రెస్‌కి నన్ను ఎక్కించాలి సుమా?"

"తప్పకుండా" అంటూ కరుణాకరం బాత్‌రూమ్‌లోకి వెళ్ళి స్నానంచేసి వచ్చాడు.

ఇద్దరూ భోంచేసినతర్వాత తమలపాకులు బాగా నమిలారు. సుమిత్ర పైకి ఎంత నవ్వుతూ మాట్లాడినా ఆమెలో ఒక అగ్నిపర్వతం ఉందని కరుణాకరానికి తెలుసు. అది ఏక్షణాన పేలుతుందో అని భయం.

"సుమిత్రా, నన్ను క్షమించావా ?"

"Don't talk rot. Behave like a grown – up man" అంటూ చప్రున లేచింది, కూచున్న కుర్చీలోనుంచి.

కరుణాకరం సుమిత్ర చేతులు పట్టుకోబోయాడు. ఆమె విదలించుకుంది.

"కరుణ్, నేనెంత బాధపడ్డానో నీకు చెప్పడం ఎందుకు ? మోసగించబడ్డ ఏ స్త్రీ బాధపడదు కనక ? పాతబాధలు కెలికి నిందారోపణలుచెయ్యడ మెందుకు ? ఇక్కడికి వస్తానా, వెర్రివాడా, నిన్ను క్షమించకపోతే."

"లోకాలు వెలిగించగల ప్రేమజ్యోతి నీలో ఉంది. కాని దాన్ని పొందే యోగ్యత నాలో లేకపోయింది."

"అదే విచారించాను. అయోగ్యునికి హృదయం ఇచ్చుకున్నానే అని. పోన్లే, అయిపోయినదానిగురించి యిప్పుడెందుకుగాని, నువ్వూ నీభార్యా సుఖంగా ఉంటున్నారా ?"

"ఓ, నువ్వూ మీ ఆయనో ?"

"స్త్రీకి ప్రేమానుభవం ఒక్కసారే సంభవిస్తుంది, కరుణ్. ప్రేమ అనేది ఒక్కసారే కలుగుతుంది. మిగతా

జీవితమంతా యిల్లూ వాకిలీ, బంధుమిత్రులూ, సొసైటీ యిత్యాదులు."

"నిన్ను పొందగలిగే ఔన్నత్యం నాలో లేదు, సుమిత్రా."

"అది వేరే చెప్పాలా? మన జీవితాలే ఆ సంగతి రుజువు చేస్తున్నాయి చుట్టూ కట్టుకున్న పేక మేడలే పడగొట్టలేని మన శక్తిసామర్థ్యాలెంత?"

"నిజమే, సుమిత్రా, అల్పుణ్ణి. కాని నిన్ను తలుచుకోని రోజులేదు. ఈనాటికీ నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఒకనాడు అంత గొప్పప్రేమ పొందాననే భావనే నా జీవితానికి జీవగర్ర అయింది. నేడు నా జీవితం సంసారానికీ, ధనసంపాదనకీ, వ్యర్థమైన పలుకుబడికీ అంకితమయింది. రోజులు యిలా గడుస్తాయి. దీనికి మార్పు ఉండదు. చిట్టచివరికి శూన్యం మిగులుతుంది."

"ఎవరికయినా అంతేగా, కరుణ్."

కరుణాకరానికి ఆ రాత్రి సుమిత్ర అమృతం పంచియివ్వడానికి అవతరించిన మోహినిలా కనిపించింది. నిస్సారమైన తన జీవితంలో ఏ అమృతవర్షం కురిపించనుందో? ఎలక్ట్రిక్ దీపాల వెలుగు ఆమె చెక్కిళ్ళమీద జారుతోంది. పదేళ్ళ క్రితం సుమిత్ర బాల. నేడు రూపవయోవిలాసిని. తను అంద కత్తెనని ఆమెకి తెలుసు. అందానికి తగిన విద్యా, ధనమూ కూడా ఉన్నాయి. ధైర్యంలేక, సరళపన్నిన వుచ్చులో

నుంచి తప్పించుకోలేక, తను ఈ సంసార కూపంలో పడ్డాడు. తెగించి, తను సుమిత్ర ముంగిట నిలిచివుంటే, తన జీవితమే పూలతోట అయేదికదా! తను పదేళ్ళు కష్టపడి సంపాయించిన సంపాదన సుమిత్రకి వున్న ఆ స్తిలో ఎన్నో వంతు? దురదృష్టవంతుణ్ణి ఎవరు బాగుచెయ్యగలరు?

కరుణాకరం మనసు రకరకాల పరుగులెత్తుతోంది. క్షణక్షణానికీ ఆమెమీద వాంఛ ప్రబలుతోంది. తనమీద యిష్టం లేకపోతే యింటికి ఎందుకు వస్తుంది? సరళ వూళ్ళో ఉండనుకుని వచ్చిందేమో! ఏమయినా ఈరాత్రి ఎలా గడుస్తుంది? తను పిరికిపంద అయినప్పటికీ పదేళ్ళతర్వాత ప్రాప్తమయిన అమృతఘడియలు.

"సుమిత్రా!"

"Yes"

"ఇలాంటిరాత్రి ఈ జన్మకి తిరిగి రాదు."

"అవును."

"ఇలా నా పక్కనివచ్చి కూచోకూడదూ?"

సుమిత్ర కరుణాకరం కూచున్న సోఫాలో కూచుని, ఆతని భుజంమీద చెయ్యివేసి, వీపు చరిచింది. కరుణాకరం నిలువెల్లా కంపించాడు. అలాంటి కంపరం సుమిత్రలోలేదు. ఆమె కళ్ళల్లోకి ప్రార్థనాపూర్వకంగా చూశాడు కరుణాకరం. ఆమెకి యిట్టే అర్థమయింది. "తప్పుకాదూ!" అంటూ అతని చెంపమీద చిన్నగా, లాలిత్య మొలికేటట్టు కొట్టి,

కిందనున్న గెస్ట్‌రూమ్‌లోకి పారిపోయి, తలుపు లోన గడియ వేసుకు నిద్రపోయింది.

ఆ రాత్రి కరుణాకరం యమయాతన పడ్డాడు. చావు బతుకుల సంధ్యారాగం తెలుసుకున్నాడు. తెల్లారి ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళిపోయింది సుమిత్ర. కరుణాకరం బతకనూ లేదు. చావనూ లేదు; మృతజీవనుడు. అందీఅందని సుమిత్ర అతనికి మిగిలిన కొద్దిపాటి మనశ్శాంతినీ దగ్ధం చేసింది. ఆమైనా కసి కొద్దీ చెయ్యలేదు—అనుకోకుండా జరిగింది.

•